# నృసింహుడి సన్నిధిలో ఎమ్మెల్సీ కవిత



ధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారిని ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆమెకు, దేవస్థాన సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వదించారు. పూజల అనంతరం స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి ఘనంగా సత్కరించారు.

- ధర్మపురి/ధర్మపురి రూరల్, నవంబర్19:

# కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- బూరుగుపల్లిలో బీడీ టేకేదార్లతో సమావేశం
- బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన టేకేదార్లు

గంగాధర, నవంబర్ 19: సీకెం కేసీఆర్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని, ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కేసీఆర్‌ను మించిన నాయకుడు లేడని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొనియాడారు. మండలంలోని బూరుగుపల్లిలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన బీడీ టేకేదార్లతో సుంకె రవిశంకర్ ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టేకేదార్లు బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బీడీ టేకేదార్లకు పించన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజారంజకంగా ఉందన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ధీమా కింద ₹5 లక్షల బీమా, ₹400కే సిలిండర్, ₹5 వేల ఆసరా పించన్, దివ్యాంగులకు ₹6 వేలు, రైతులకు పెట్టుబడి సాయంగా ₹16 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య శ్రీని ₹15 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. భవ్యక్షేత్రం కొండగట్టు ఆలయాన్ని ₹వెయ్యి కోట్లతో అద్భుతంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు వచ్చిపోయేవారిని నమ్మవద్దని, స్థానికేతరులకు ఓటు వేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉండి ఐదేళ్లలో ₹1800 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన తనను మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే మరిత అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు.



బూరుగుపల్లిలో ఎమ్మెల్యే రవిశంకర్‌కు మద్దతు తెలుపుతున్న బీడీ టేకేదార్లు

# కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని యాగం

- పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 19: బీఆర్ఎస్ తెలంగాణలో మూడోసారి అధికారంలోకి రావాలని, పార్టీ అధినేత కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని, తాను హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలువాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి హోమం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఆయన సతీమణి శాలిని, కుమార్తె శ్రీనికారెడ్డి, ఇతర కుటుంబసభ్యులతో కలిసి పట్టణంలోని విద్యానగర్‌లో గల ఆయన నివాసం వద్ద ఆదివారం మహా గణాధిపతి, రాజ్యశ్యామల, బగలముఖి, చండీ సుదర్శన కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సుభిక్షంగా తయారుచేసి ప్రజలందరి మన్ననలు పొందిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పార్టీ రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి రావాలని కోరుకున్నట్లు తెలిపారు. దానికి భగవంతుడు, ప్రజల ఆశీస్సులు ఉండాలని కోరారు. కార్యక్రమంలో కౌశిక్‌రెడ్డి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు గందే రాధిక శ్రీనివాస్, కొలిపాక నిర్మల శ్రీనివాస్ దంపతులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజ్యశ్యామల యాగం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు





నగునూర్‌లో కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు, హాజరైన ప్రజలు

# అభివృద్ధిపై చర్చించండి

- కారు గుర్తుకు ఓటేయండి
- ఇంటి పార్టీని గెలిపించండి
- కేసీఆర్ ముఖ్యమంత్రిగా లేకుంటే తెలంగాణ ఆగమైతది
- కాంగ్రెస్, బీజేపీ దోఖాబాజీ పార్టీలు
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నగునూర్, 37, 38, 55 డివిజన్లలో విస్తృత ప్రచారం
- కరీంనగర్‌లో హాజరైన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ రూరల్, నవంబర్ 19 : తెలంగాణ కోసం పోరాడిన కేసీఆర్ సీఎంగా లేకపోతే, రాష్ట్రం ఆంధ్రోళ్ల చేతుల్లోకి పోయి ఆగమవుతుందని, వాళ్ల నుంచి కాపాడుకుందామని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ మండలంలోని నగునూర్ గ్రామంలో మంత్రి గంగుల ఒగ్గుడోళ్ల కళాకారులు, డప్పు చప్పుళ్లతో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. గ్రామస్తులు ఆయనను గజమాలతో సత్కరించారు. యువకులు పటాకులు కాల్చుతూ, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. గొంగలి, గొర్రెపిల్లను బహూకరించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడారు. తాను తప్పు చెబితే తనకు ఓటేయద్దని, నిజం చెప్పినట్లు అనిపిస్తే ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నగునూర్ వస్తే రోడ్లు, తాగు, సాగు నీరు, కరెంట్ లేని పరిస్థితులు చూసి కళ్లలో నీళ్లు తిరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలో అంతర్గత రహదారులను అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. జనవరిలో గ్రామంలోని దళితులందరికీ దళితబంధు ఇస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన వారందరికీ కూడా బీసీ బంధు కూడా పూర్తి చేస్తామని భరోసా కల్పించారు. జనవరి నుంచి అందరికీ కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు అందజేస్తామన్నారు. సమైక్య పాలనలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని అభివృద్ధి కోసం నిధులు కావాలని అడిగితే వెకిలిగా నవ్వారని వాపోయారు. ఆంధ్రాకు చెందిన వారే ముఖ్యమంత్రులు కావడంతో గోదావరి జలాలను, మన బొగ్గును దోచుకుని తెలంగాణను గుడ్డిదీపం చేశారని తెలిపారు. స్వయం పాలనలో సీఎం కేసీఆర్ సహకారంతో వేలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. నియోజకర్గ వ్యాప్తంగా సీసీ రోడ్లను నిర్మించానని, యాభై ఏండ్లలో జరగని అభివృద్ధిని చేసి చూపించానన్నారు. ఎంపీ బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా టికెట్లు ఇస్తానని చెప్పి కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. విషయం తెలిసిన మోదీ బండి పదవిని తీసేశారని పేర్కొన్నారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచి నాలుగేండ్లైనా ఒక్క గ్రామానికి కూడా వచ్చింది లేదన్నారు. దీంతో ఇగ ఎంపీగా ఆయనకు టికెట్ ఇవ్వరనే, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. బీజేపీ, కాంగ్రెస్ దోఖాబాజీ పార్టీలని, ఆ పార్టీల నాయకులు కేవలం ఎన్నికలప్పుడూ మాత్రమే కనిపిస్తారన్నారు. ఓటేయించుకొని మాయమవడం తప్ప వాళ్లు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. తాను ఎల్లప్పుడూ మీ కళ్ల ముందే ఉంటూ ఆపదలో అండగా ఉన్నానని గుర్తు చేశారు. యాభై ఏండ్లు పాలించిన కాంగ్రెస్ మన బతుకులు చీకటిమయం చేసిందని, ఆ పార్టీకి అధికారం ఇస్తే తెలంగాణను దోచుకొని గుడ్డిదీపం చేస్తుందని విమర్శించారు. ఆంధ్రా నాయకులు హైదరాబాద్‌లో అడ్డ వేశారని, ఢిల్లీ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు సమైక్యవాదుల ముసుగులో తెలంగాణను దోచుకునేందుకు వస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యంగా సమైక్యవాదులతో కలిసి వస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని, బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మితే మన పిల్లల భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. కోట్ల రూపాయలతో తెలంగాణను అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని, కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కాగా పలు పార్టీలకు చెందిన 20 మంది యువకులు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ప్రచారంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, పి శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్ ఉప్పుల శ్రీధర్, ఎంపీటీసీ సాయిల్ల వినయ్‌సాగర్, ఎ శ్రీనివాస్, నాయకులు దాది సుధాకర్, కస్తూరి రాంరెడ్డి, కస్తూరి శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది రమేశ్, పెంచాల శ్రీనివాస్‌రావు, బత్తిని రాజగౌడ్, బత్తిని దిలీప్‌గౌడ్, మధుకర్, దావు సంపత్, నెక్ పాషా, వరి భద్రయ్య, బోనగిరి హన్మంతరావు, దావు రవితేజ, జీకే యూత్, కస్తూరి శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల కిరణ్, తప్పట్ల నరేశ్, గర్వంధ శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

# అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్
- కోహెడ మండలంలో ఇంటింటా ప్రచారం
- ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టిన మహిళలు
- పూలు చల్లుతూ మంగళ హారతులతో స్వాగతం

కోహెడ, నవంబర్ 19: మండలాన్ని అభివృద్ధి చేశానని, ఆశీర్వదించి మరోమారు గెలిపించాలని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని సముద్రాల, నాగసముద్రాల, బత్తులవానిపల్లి, బస్వాపూర్, ఆరెపల్లి, పోరెడ్డిపల్లి, గుండారెడ్డిపల్లి గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, మహిళా స్వశక్తి భవనాలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, గ్రామపంచాయతీ భవనాలు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఆసరా, తదితర పథకాలు ప్రతి గ్రామానికి, ఇంటింటికీ అందించానన్నారు. మోయతుమ్మెద, ఎల్లమ్మ వాగులలో చెక్ డ్యాంలను నిర్మించి సాగునీటి కొరత లేకుండా చూశానన్నారు. కోహెడ మండలం సాగునీటితో సస్యశ్యామలంగా మారిందన్నారు. పలు గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ నుంచి 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలో ఎంపీపీ కొక్కుల కీర్తి, జడ్పీటీసీ నాగరాజు శ్యామల, ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆవుల మహేందర్, జిల్లా నాయకులు నాగరాజు, మధుసూదన్‌రావు, కొక్కుల సురేశ్, కర్ర రవీందర్, తిప్పారపు శ్రీకాంత్, పిల్లి మాధవి, పూలవిజయ, కన్నం లక్ష్మి, రాజు, కొడముంజ మల్లవ్వ, బానోతు సరోజన, ఎడబోయిన సత్తయ్య, తిరుపతిరెడ్డి, కనకయ్య, అశోక్‌రెడ్డి, జాలిగాం శంకర్, తిప్పారపు నాగరాజు పాల్గొన్నారు.





సతీశ్‌కుమార్‌కు గొంగళి కప్పి గొర్రె పిల్లను అందజేస్తున్న గొల్లకుర్మలు, సముద్రాలలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు